# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 31-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వికసిత్ భారత్ - 2047 అభివృద్ధి ప్రయాణంలో నలంద విశ్వవిద్యాలయం వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశ్వాసం వ్యక్తం చేశారు.

- ❖ కృత్రిమ మేధ, సెమీకండక్టర్ల రంగాలలో ప్రభుత్వ కార్యక్రమాలు యావత్ ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చబోతున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు.

- ❖ భారతదేశం 2032 నాటికి ప్రపంచంలోని తొలి 6 అగ్రశ్రేణి సెమీకండక్టర్ దేశాలలో ఒకటిగా నిలుస్తుందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

- ❖ దేశంలోని 8 రాష్ట్రాలకు 2 వేల 461 కోట్ల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

- ❖ చండీఘర్ లోని ములాన్పూర్ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

======================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బీహార్ లోని రాజ్‌గిర్‌లో ఉన్న నలంద విశ్వవిద్యాలయం రెండవ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఈరోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన 36 మంది విద్యార్థులకు బంగారు పతకాలను రాష్ట్రపతి అందించారు. అదే విధంగా 10 మంది పరిశోధక విద్యార్థులకు పీ.హెచ్.డి పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ... ప్రాచీన నలంద విశ్వవిద్యాలయం దాదాపు 8 శతాబ్దాల పాటు ప్రఖ్యాత విద్యా కేంద్రంగా నిలిచిందని, నలంద పతనం భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు. అయినప్పటికీ నలంద భావన సజీవంగానే ఉందని... దూరదృష్టి గల నాయకత్వం, నిరంతర సంస్థాగత ప్రయత్నాలు, భాగస్వామ్య దేశాల సమన్వయం ద్వారానే ఈ పునరుజ్జీవనం సాధ్యమైందని చెప్పారు. నేడు పట్టభద్రులవుతున్న వారిలో సగానికి పైగా అంతర్జాతీయ విద్యార్థులు ఉండటం సంతోషంగా ఉందన్నారు. వికసిత్ భారత్-2047 అభివృద్ధి ప్రయాణంలో నలంద విశ్వవిద్యాలయం వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని

విశ్వాసం వ్యక్తం చేశారు. జ్ఞానం శాశ్వతంగా నిలుస్తుందని, అభ్యాసన మానవాళికి సేవ చేస్తూనే ఉంటుందన్న నాగరిక వాగ్దానాన్ని నేటి స్నాతకోత్సవ కార్యక్రమం పునరుద్ఘాటిస్తోందని రాష్ట్రపతి పేర్కొంటూ…

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటనలో భాగంగా సనంద్‌లో కేన్స్ టెక్నాలజీ సెమీకండక్టర్ ప్లాంట్ ను ఈరోజు ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. గత ఫిబ్రవరి 28న మైక్రాన్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం సందర్భంగా తాను సనంద్‌లో ఉన్నానని, సరిగ్గా నెల రోజుల తర్వాత కేన్స్ మైలురాయి కోసం తిరిగి ఇక్కడకు వచ్చానని పేర్కొంటూ.. ఇది భారతదేశ సెమీకండక్టర్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతున్న వేగానికి నిదర్శనమని చెప్పారు. భారతదేశ సెమీకండక్టర్ పరిశ్రమ వివిధ రాష్ట్రాలలో అభివృద్ధి చెందుతూ యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తోందన్నారు. సాంకేతికత, ఏఐ, సెమీకండక్టర్ల రంగాలలో ప్రభుత్వ కార్యక్రమాలు యావత్ ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చబోతున్నాయని చెప్పారు. కీలక ఖనిజాలలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు, ఖనిజాల తవ్వకం, ఉత్పత్తిపై దృష్టి సారిస్తూ.. నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రారంభించామని నరేంద్రమోదీ పేర్కొంటూ…

(వాయిస్ 28 సెకన్లు)

అనంతరం ఇటీవల ఏర్పడిన వావ్-థరాద్ కొత్త జిల్లాలో 19 వేల 800 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత వైమానిక దళం కోసం అనుబంధ పరికరాలు, అవసరమైన మౌలిక సదుపాయాలతో సహా రెండు మౌంటెన్ రాడార్లు కొనుగోలు చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (BEL)తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. 1,950 కోట్ల రూపాయల వ్యయంతో కూడిన ఈ ఒప్పందం ఆత్మనిర్భర్ భారత్, మేక్-ఇన్-ఇండియా పథకాల కింద భారతదేశ స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయనుంది. రక్షణ మంత్రిత్వ శాఖ, BEL ఉన్నతాధికారుల సమక్షంలో న్యూఢిల్లీలో ఈ ఒప్పందంపై ఈరోజు సంతకాలు జరిగాయి. ఈ రాడార్ల స్థాపన భారత వైమానిక దళం సామర్థ్యాలను పెంచి.. జాతీయ భద్రతను పటిష్టం చేస్తుందని, అదే విధంగా విదేశీ పరికరాలపై ఆధారపడటాన్ని కూడా తగ్గిస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ సెమీకండక్టర్ల సరఫరా వ్యవస్థలో భారతీయ కంపెనీ చేరడం గర్వకారణమని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. గుజరాత్‌లోని సనంద్‌లో కేన్స్ సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… 2032 నాటికి భారతదేశం ప్రపంచంలోని తొలి 6 అగ్రశ్రేణి సెమీకండక్టర్ దేశాలలో ఒకటిగా నిలుస్తుందన్నారు. ఇక 2047 నాటికి ప్రపంచంలోని 3 అగ్ర దేశాల సరసన చేరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'డిజైన్ ఇన్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా' అనే సంకల్పంతో 2 నేనో మీటర్ చిప్స్ పై భారత్ పని చేస్తోందని అశ్విని వైష్ణవ్ తెలియజేస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని 8 రాష్ట్రాలకు 2 వేల 461 కోట్ల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం ఈరోజు విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్యప్రదేశ్, పంజాబ్, సిక్కిం రాష్ట్రాలలోని గ్రామీణ స్థానిక సంస్థలకు ఈ నిధులను విడుదల చేసింది. అలాగే హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు అనుబంధ, అనుబంధేతర గ్రాంట్స్ లో నిలిపివేసిన మొత్తాన్నికూడా విడుదల చేసింది. ఈ నిధులు క్షేత్రస్థాయి పాలనను పటిష్టం చేయడమే కాకుండా.. పంచాయతీ రాజ్ సంస్థల్లో స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు తోడ్పడుతాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లోని ఒక ఆలయంలో ఈరోజు చోటు చేసుకున్న తొక్కిసలాటలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. నలంద జిల్లా బీహార్ షరీఫ్‌లో ఉన్న మాఘ్రా శీతలాష్టమి ఆలయంలో ఈ ఉదయం మతపరమైన ఆచారాలు జరుగుతుండగా భారీ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 8 మంది మహిళా భక్తులు ప్రాణాలు కోల్పోగా.. మరికొంతమంది గాయపడ్డారు. గాయపడిన వారిని వైద్య సహాయం కోసం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. భక్తుల ప్రాణనష్టం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని సామాజిక మాధ్యమ పోస్ట్‌లో ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయలు చొప్పున ఎక్స్-గ్రేషియాను ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

చండీఘర్ లోని ములాన్పూర్ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ టైటాన్స్ 11 ఓవర్లు పూర్తి అయ్యేసరికి రెండు వికెట్లు నష్టపోయి 89 పరుగులు చేసింది. ఓపెనర్లు శుభమాన్ గిల్ 39 పరుగులు చేయగా… సాయి సుదర్శన్ 13 పరుగులు చేసి ఔటయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

క్రియాశీలకంగా ఉన్న రెండు పశ్చిమ అలజడుల కారణంగా రాబోయే వారం రోజులు వాయువ్య భారతదేశంలో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. మహారాష్ట్రలో రానున్న రెండు రోజులు ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున IMD ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. పశ్చిమ బెంగాల్, సిక్కింలలో కూడా గురువారం వరకూ ఇలాంటి పరిస్థితులే కొనసాగుతాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =